# ఎదురుతిరిగిన ఆయుధాలు

ఊరు చివరి కాలవ పక్కన చుట్టూరా గుంపులు గుంపులుగా జనం పోలీసు వలయాన్ని నెట్టుకొని శవాల దగ్గరికి రావాలని ఆందోళన పూరిత కదలికలు. పొద్దు బారెడు ఎక్కింది. ఆ రోజు దట్టంగా కురుస్తున్న మంచు వల్ల ఒకరినొకరు పోల్చుకోలేని వాతావరణం. పంచనామా అయ్యేంతవరకు ఎవరు శవాల దగ్గరికి వెళ్ళద్దని ఆంక్షలు. అమ్మోరి పండుగ పేరిట నరికి పడేసిన గొర్రెల్లా అక్కడ శవాలు.

మేజిస్ట్రేట్ ఆయన వెంట సిబ్బంది ఒక్కొక్క శవాన్ని పరిశీలించి పంచనామా రాసుకుంటున్నారు. అక్కడ అంతా గౌలు వాసన.

"దొర కాళ్ళు చేతులు నరికేసిన ఒట్టి మొండెం దొరా "

"గుర్తుపడ్తావా ఈయనెవరో " - మేజిస్ట్రేట్

"ఈయన పోకల జోసెఫ్ దొరా "

" ఏం చేస్తుండేవాడు "

"ఫాస్టర్ పని, మునిలాంటోన్ని నరికి చంపటానికి ఎట్టా పానం ధరించిందో "

"వాళ్ళు మనుషులు కాదు " - బరువైన శ్వాస ఒదులుతూ మెజిస్ట్రేట్.

"బైబిల్ చదువుతూ దైవప్రార్ధనలు చేస్తూ ఉండేవాడు. ఎవర్నీ పల్లెత్తు మాట అనేవాడు కాదు దొరా " అంటూ ఆయన ప్రార్ధనలు చేసేటపుడు ఎలా నిలుచుండేవాడో అలా కాసేపు నిలుచున్నాడు.

పోలీసు వలయాన్ని నెట్టుకొని రావాలని జనం ప్రయత్నం.

నాలుగైదు గజాల దూరంలో మరొక శవం. తలలేదు ఒట్టి మొండెం మాత్రమే.

దృఢకాయుడు ఎడమ చేతిమీద సముద్రం అని ఉన్న పచ్చబొట్టును గుర్తుపట్టి

"దొరా ఈయన హనుమంతు. గజ ఈతగాడు, కూలీ నాలీ చేసుకొని బతికేటోడు. ఉప్పెనలు, వరదలు వచ్చినపుడు జనాలను వాళ్ళ ఆస్తులను కాపాడేవాడు " అని చెపుతున్నపుడు మస్కూరీ కళ్ళల్లో నీళ్ళు తిర్గినయి.

"ఉద్రేకంతో ఊరు పెద్ద అండనే పోగొట్టుకుందే " - మెజిస్ట్రేట్.

"పెళ్ళాం పిల్లలున్నారా? " మళ్ళీ తనే -

"ఎక్కడి పెళ్ళాం, ఎక్కడి పిల్లలు? పెళ్ళి చేసుకుంటేనే తనకు పిల్లలు పుడతరు ఉప్పెనలొచ్చినపుడు తన పెళ్ళాం పిల్లలతో తాను తన ఇంట్లో ఉంటే తాను కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ వస్తున్న ఊరు బురదపాలైపోదూ? అని అంటూ ఉండేవాడు దొరా "

అంటున్నపుడు దుఃఖం పొంగిపొరలింది.

మెజిస్ట్రేట్ కళ్ళు చెమ్మగిల్లినాయి. తాను రాస్తున్న రాత మసక మసగ్గా కనిపిస్తుంది. ఓ బరువైన శ్వాస వొదిలి అక్కడినుండి పక్కకు నడిచాడు.

అక్కడ ఓ మడుగు, దాన్నిండా తామరాకులు,, నీళ్ళు మురికి అయి పైన పచ్చని పొర లాంటిది పేరుకొని ఉంది. నాలుగైదు ఊరకుక్కలు, మూతి కట్టి బురదలో తొక్కిన గోనెసంచినిపైకి లాగుతున్నాయి. అది చూసిన మస్కూరి ఒంగి రాయందుకొని విసిరాడు. ఒక్కసారె కుక్కలు రాయి వచ్చినవైపు చూస్తూ కొంత దూరంవెళ్ళి నిలుచున్నాయి. వెంటనే తన చేతిలో ఉన్న బరిసెను విసిరాడు. కర్ర దెబ్బను తప్పించుకోలేని కుక్కలు గునుస్తూ పరిగెత్తినాయి. జనం శవాల దగ్గరిక్కి రావటానికి ఒకర్నొకరు తోసుకుంటున్నారు. వాళ్ళను నిలుచున్న చోటునుండి కదలనీయకుండా పోలీసులు లాఠీలను అడ్డుపెడుతున్నారు.

భర్త కనబడలేదని ఓ భార్య ఆందోళన.

కొడుకు కోసం ఓ తల్లి ఏడుపు.

తోడబుట్టిన వాళ్ళకోసం ... అక్కాచెల్లెల్ల ఏడుపులు, పెడబొబ్బలు. అక్కడున్న వాళ్ళదరూ కూలినాలి చేసుకొనే జనమే. సంకలో పెట్టెతో ఓ మంగలి భుజం మీద టవల్‌ను నోట్లోనిపళ్ళ మధ్య నొక్కిపట్టి కలత మనసుతో చూస్తూ ఉన్నాడు. గోనెసంచిని సమీపించిన మెజిస్ట్రేట్ కానిస్టేబుల్స్‌వైపు చూసి ఓ యిద్దర్ని రమ్మన్నాడు. "ఏమిటి ఆ శబ్దం.... ఫైరింగ్ ఆర్డర్ ఇచ్చారా? "

"లేదు సర్ "

"త్వరగా వివరాలు చెప్పాలి ఓవర్ "

" సర్ ఓవర్ " అంటూ రిసీవర్‌పెట్టేసి సి.ఐ వైపు చూస్తూ ఏమిటా తుపాకీ చప్పుడు?

"తెలుసుకుంటాను సర్ "

"తెలుసుకుంటాను, నడువరా. ఇప్పటికే ఊరు పీనుగుల పెంటైంది, పరుగెత్తు "

అని గర్జించాడు.

ఈలోపున పరుగుపరుగున వచ్చిన హెడ్ కానిస్టేబుల్ -

" సర్ పికెటింగ్ దగ్గర కానిస్టేబుల్ ఓ యువకున్ని ఫైర్ చేశాడు సర్. "

" ఫైర్ ఆర్డర్ ఎవరిచ్చారు " కళ్ళెర్ర చేస్తూ అడిగాడు.

" ఎవరూ ఇవ్వలేదు సర్ " వినయంగా సమాధానం ఇచ్చాడు.

"మరెట్లా ఫైర్ చేశాడ్రా " పళ్ళు పటపటమని కొరుకుతూ అడిగాడు.

"అదే అడిగాను సర్, అడిగితే ఆ యువకుడొచ్చి రాత్రి నుండి పేద జనాన్ని నర్కి ముక్కలు చేస్తుంటే మీ పోలీసోళ్ళు ఏం చేస్తుండ్రని, మీరంతా ధనిక వర్గపు తొత్తులురా

అని తిట్టాడట సార్ "అన్నాడు హెడ్.

"తిట్టగానే ఫైర్ చేయటమేనారా "

మౌనంగా నిలుచున్నాడు హెడ్.

"వాని పరిస్థితి ఎలా వుంది "

"స్పాట్ డెత్ సార్ "

"పి.సి.ని లాకప్ లో వేసేయండ్రా, హు నడువ్ "

సెల్యూట్ చేసి హెడ్ కదిలాడు.

విషయం అందరిక్కీ తెలిసిపోయింది.

జనం పోలీసుల మీద విరుచుకపడ్డారు. రాళ్ళను రువ్వారు. పోలీసులు టియర్ గ్యాస్ వదిలారు. ఏం జరుగుతున్నది అందరూ గ్రహించేసరికి పోలీసు వలయాన్ని ఛేదించుకుని జనం శవాలను చేరి, ఎవరెవరు చంపబడ్డారో గుర్తుపట్టి, ఎదను బాదుకుంటూ ఏడవసాగారు. అప్పుడు తెల్సిపోయింది ఆ వూరి దళితులను ఊచకోత కోశారని.

* * *

మంత్రిగారి గదిలో పర్సనల్ ఫోన్ మ్రోగింది. మంత్రిగారు తన దగ్గరి వాళ్ళతో మాట్లాడేది ఆపి రిసీవరందుకొని -

"హల్లో "

"మంత్రిగారాండి. "

"మాట్లాడుతున్న "

"నేను భూపాల్ చౌదరిని మాట్లాడుతున్న "

" ఎలా వుంది పరిస్థితి? "

"మనవాళ్ళు వచ్చారు కదా - చెప్పొచ్చు "

"నీవు రా, స్పాట్ మీద ఎవరుండవద్దు. ఎక్కడినుండి మాట్లాడ్డం ? "

"ఊరిబయట మిల్లు నుండి "

"రాత్రి మిగిలిపోయిన పని ఉదయం అయిపోయింది. జనం పోలీసుల మీద తిరగబడ్డారు. గడ్డివాములను, గొడ్లని తగులబెడుతున్నారు. "

"నీవైతే త్వరగా వచ్చేయి. జాగ్రత్త. "

"తమరొకసారి ఐ.జి.పి. కి ఫోన్ చేయండి సార్. సర్ ముఖ్యమంత్రిగారు ఏంది సార్ ఆస్టేట్‌మెంట్? హంతకులెవరైనా వదిలేది లేదు. చట్టానికి లొంగకపోతే వాళ్ళ ఆస్థులను జప్తు చేస్తాం అన్నారు రేడియోలో "

"అంతే అంటాడు మరి. యివన్నీ ఫోన్‌లో మాట్లాడేవి కావు. రా వచ్చేయి ముందు"

ఫోన్ పెట్టేసిన శబ్దం.

చౌదరి ఫోన్ పెట్టేసి జేబులోనుండి పొర చుట్టను తీసి నోట్లో పెట్టుకుంటూ -

"మాల మాదిగల కొడుకులు ప్రభుత్వం పెట్టే పిడికెడు మెతుకులకు నాలుగక్షరాలు వచ్చేసరికి కిందా మీదా కానరాకుంట తిరుగుతాగ్రా ? ఏదో అదృష్టం బాగుండి యింతే జరిగింది. లేకుంటే ఈ పాటికి రెండు వాడలు కాష్టాల గడ్డలుగా మారకపోవు" అనుకుంటూ అగ్గిపుల్లను గీసి చుట్టను అంటించుకున్నాడు.

ఊరి బయట ఊడల మర్రి. కింద ఆ ఊడల పైన కొమ్మల మధ్య మనుషులు దాక్కుంటేకానరాకుండా ఉండొచ్చు. అరవై ఏండ్ల వ్యక్తి ఆ చెట్టు కింద నివాసం. తినడానికి ఓ రాతెండి గిన్నె, రాతెండి గ్లాసు, ఓ కుక్కి మంచం. దాని పక్కనే ఓ నీళ్ళ కుండ. మంచానికి కొద్ది దూరంలో ఓ కుంపటి. దాని పక్కమ్మటే కుక్క.

ఏదో గుంపు మర్రిచెట్టు వైపు వస్తున్న అలికిడి. అది విని అరుస్తోంది కుక్క. దాని అరుపులో ఏదో కలవరం గమనించిన ముదుసలి తన భుజం మీద కర్రను చేతిలోనికి తీసుకొని లేచి నిల్చున్నాడు. కుక్క అరుస్తూనే వుంది. చెట్టు కిందకు చేరవచ్చిన వాళ్ళలోని ఒకడు రాయి విసిరి కుక్కను దూరంగా తరిమాడు. అది ఓ మాదిరి శబ్దం చేస్తూ తన యజమాని వద్దకు వెళ్ళి నిలుచుంది. ఏం జరుగుతుందో చూడలేని ఆ వ్యక్తి చెవులను అటువైపు వుంచి నిలుచున్నాడు. జిల్లా నుండి వచ్చిన అధికారులు, ఛోటా బడా నాయకులు, ఊళ్ళోని జనం చెట్టుకింద చేరారు. వాళ్ళతో పాటు కుర్చీలు, బల్లలు చేరాయి. అప్పటికప్పుడే అక్కడ ప్రజా కోర్టు వాతావరణం ఏర్పడింది. చెట్టుకింద ఏదో జరుగబోతుందని గ్రహించిన ముదుసలి తన నులక మంచాన్ని పక్కకు నెట్టి నిలుచున్నాడు. జనం పిల్లలతో సహా వచ్చి రెండు వర్గాలుగా చీలిపోయి నిల్చున్నారు. దళితుల బతుకుల్లో రోగాలు, నొప్పులు, కొట్టిన గాయాలతో బక్కచిక్కిన శరీరాలను పూర్తిగా కప్పుకోలేని గుడ్డపీలికలు. ఏ పూట పూర్తిగా నిండక అంటుకుపోయిన ఎండు కడుపులు. తమవారిని పోగొట్టుకొని గుండె నిండా దుఃఖం గూడు కట్టుకోగా కళ్ళు కాలువలైనాయి.

ఇక రెండవ వర్గానికి చెందిన రెడ్లు, చౌదరీలు; నాయుళ్ళు, కానీ ముఖ్యులెవ్వరూ అక్కడికి రాలేదు. వాళ్ళవాళ్ళ తాలూకు వాళ్ళు మాత్రం వచ్చి నిలుచున్నారు. పది గంటల వేళ ఎండ ముదురుతూ ఉన్నా మర్రి నీడ గొడుగు పట్టినట్లుంది.

కమీషన్ విచారణ మొదలైంది. విషయాన్ని వివరాలను ప్రకటించారు.

జనంలో గుసగుసలు, -

కమీషన్ ప్రశ్నలు...అక్కడ ఆసక్తితో నిలుచున్న వాళ్ళ జవాబులు. ఎవరు ఏం చెప్పినా ఆ ఊళ్ళో ఆ రోజు మారణహోమం ఎందుకు జరుగింది? ఎవరు జరిపారో

చెప్పటంలేదు. చంపబడ్డ వాళ్ళను తెల్లారి అందరం చూశాము. కాని చంపిందెవరో చూడలేదు.

"ఆ రోజు రాత్రి చిమ్మచీకటి. అందరో నిద్రబోయినంక జరిగింది. ఏ మాత్రం అరిచినట్లు కూడా వినపడలేదు "అని అగ్రవర్ణాల వారు అందరూ ఏకగ్రీవంగా అన్నారు.

"మరి మీ, మీ యజమానులు ఎక్కడ? కమీషన్ ప్రశ్న. "

"చుట్టం చూపుకు కొందరు, వ్యాపారాల నిమిత్తం కొందరు, మరెన్నో పనుల మీద కొందరు వెళ్ళారు " అని వాళ్ళ వాళ్ళ తాలూకా వాళ్ళ జవాబు.

"ఆ పనులా పాడా. సంపింద్రు పర్రారైంద్రు " బాధితుల గొంతులు.

"ముందు వాళ్ళను పట్టుకొస్తే అసలు విషయం బయటికొస్తది. అసలు వాళ్ళు లేకుండా ఏదీ బయటకు రాదు. ఎక్కడున్నా సరే. వాళ్ళందర్నీ అరెస్ట్ చేసి తీసుకరావల్సిందే " అన్నారు దళితులు.

" మేం ఊరికి చాకిరి చేసినం కాని ఏ పాపం చేయలేదే " ఓ విధవరాలు.

" ఎందుకు మా వాళ్ళను ఊచకోత కోసినట్టు? " మరో స్త్రీ.

" మీరు ఉండడానికి ఇండ్లు కడితిమి " తాపీ మేస్త్రీ

" మేం కష్టించి పనిచేస్తే మీ గరిసెలె నిండె. అయ్యో..అయ్యో. మీ కాష్టాలను కాల్చి బూడిదలను దగ్గరికి చేసి, మీ పీనుగులకు బొందలు తవ్వి, పూడిచే వాణ్ణి కూడా వదలక సంపిరి. యిక రేపటినుండి ఆ పనులను మీరే చేసుకోవాలె " కోపంతో మొదలుపెట్టి దుఃఖంతో ఆగింది. ఆ మె ఏడుపు ఆమె భర్త చేసే పనిని గుర్తుచేసి చివరన ఆమె చేసిన హెచ్చరిక కమీషన్ను కదిలించింది.

తన మువ్వల కర్రను ఆసరాగపెట్టుకొని జరుగుతున్న సంభాషణను శ్రద్ధగా వింటున్నాడు ముదుసలి. అతని పాదాల దగ్గర అసౌకర్యంగా గునుస్తూ కుక్క.

ఇరువైపులా వాదోపవాదాలు, ఆవేస పూరితమాటలు, హెచ్చరికలు.

చంపబడ్డ వాళ్ళరతా దళితులని తేలింది. చంపిన వాళ్ళు ఎవరో తేలవలసి వుంది. ఎంత ప్రశ్నించినా ఏ మాత్రం క్లూ ఇవ్వడం లేదు.

"యిలా వుంటే నిందితులని నిర్ధారించటం కష్టం అంటూ చుట్టూ చూశాడు" కమీషనర్.

" ఎవరన్న ఏమన్నా చెప్పదల్చుకుంటే నిర్భయంగా చెప్పండి. మిమ్ములను ఎవరూ ఏమీ చేయరు. మీకు ప్రభుత్వ పరంగా పూర్తి రక్షణ వుంటుంది " అంటూ ప్రకటించాడు కమీషన్. ఎడమ వైపు పోలీస్ ఫోర్స్ నిలుచున్నారు.

జనాన్ని నెట్టుకుంటూ ఓ యువకుడు కమీషన్ ముందుకొచ్చి నులుచున్నాడు. అతన్ని

చూసిన జనం, పోలీస్ ఫోర్సులో కలవరం మొదలైంది.

"సార్ నాకు తెలిసింది నేను చెపుతాను " అంటూ నిలుచున్నాడు. కమీషన్ అప్పటి దాకా మూసి వుంచిన పెన్నును తెరుస్తూ -

" పేరు "

" ప్రకాశ్ "

" ఏం చేస్తుంటావు "

" సస్పెండైన పి.సి.ని సార్ ఈ ఊళ్ళోనే ప్రసాదనే యువకున్ని కాల్చేశాను సార్ "

"ఆ ఆ " అంటూ ఆలోచనల్లోకి వెడుతూ ఫైలును తిరగేస్తూ ఆనాటి ఫైరింగ్ వివరాలను చూస్తూ యువకున్ని కాల్చేసిన పేరా దగ్గర ఆగి,

" ఎందుకయ్యా ఆ యువకున్ని కాల్చేశావు. అందునా రేపు సమాజానికి ఉపయోగపడే డాక్టరు కోర్సు చదువుతున్నాడు " అంటూ పి.సి. వైపు చూశాడు.

"ఊళ్ళో దళితులకు ఏ అన్యాయం జరిగినా మా పోలీస్ పికెటింగ్ దగ్గరకొచ్చి దరఖాస్తులు ఇచ్చి చర్య తీసుకోవాలని వాదిస్తూ వుండేవాడు సర్. ఆ హత్యలు జరిగిన రోజు తెల్లవారుజామున నేను సెంట్రీ డ్యూటీ ఎక్కాను సర్. డ్యూటీ దిగిన వ్యక్తి ఇంటికి మిగతా పీ.సి.లు, ఎస్.పి. గారు కూడా వచ్చారు కనుక నేను హత్యలు జరగిన స్థలానికి వెళ్ళాను సర్. నేను అక్కడే వున్నాను సార్. చౌదరి గారి మనిషి ఒకాయన ఓ బ్యాగ్ నిండా నోట్లకట్టలతో వచ్చి నాకిచ్చి ఈ లక్షను ఉంచుకో పని అయినంక మరో లక్ష. ఎవరి పేరు బయటికి రావద్దు. రాత్రి జరిగిన హత్యల విషయంలో ఈ రోజు ఊళ్ళో గొడవ జరుగుద్ది. లాఠీ ఛార్జి, ఫైరింగ్ కూడ కావచ్చు. ఎలాగో ఫలానా వాడు కంప్లెయింట్ చేయడానికి వస్తాడు. వాదనలోకి దిగుతాడు. అదను చూసి వాన్ని కాల్చేయి. అన్నాడు సార్. నాకు ఎటూ పాలు పోలెదు. వాడు చౌదరిగారి అమ్మాయిని సినిమా హాలు దగ్గర అవమానపరిచాడట. రాత్రి పదిమందిని నరికేసిన పగ చల్లారలేదట. ఆ రాత్రి వీడు దొరకలేదట. అందుకని ఈ పనిని చూసుకొమ్మని డబ్బుసంచి నాకందించి వెళ్ళాడు. పదిమందిని వాళ్ళే చంపారు. పదకొండోవాన్ని నేను చంపితే అందులో కల్సిపోద్దిలే అనుకున్నాను కానీ ఉద్యోగమే పోతుందని అనుకోలేదు సార్ "

దళితుల జనంలో కలవరం లేచింధి. అప్పుడు మర్రి ఒక్కసారే పండుటాకును రాల్చింది.

అమ్మాయికి జరిగిన చిన్న అవమానానికి పదకొండు మంది ప్రాణఅలు బలే అనుకుంటూ కనుబొమ్మలు కదిలించాడు కమీషనర్.

దళితులు తలా ఒకరాయి అందుకున్నారు. పోలీసులు తుపాకులు సవరించుకున్నారు. అది గమనించిన కమీషన్ -

"ఆగండి. తప్పించుకున్న వాళ్ళను మీరు పట్టుకోలేక పోయారు. తనంతట తానే వచ్చిన ఒక్క సాక్ష్యాన్ని మీరు లేకుంట జేస్తే ఈ కేసు పరిష్కారమయ్యేది ఎట్లా? "అంటూ తన కళ్ళద్దాలను తీసి పక్కకు పెట్టి అందరి వైపూ చూశాడు.

జనం ఆయన విన్నారు.

"అయితే చౌదరి గారు ఎక్కడ ఉన్నారో తెలుసా నీకు? " కమీషనర్.

"తెలియదు సార్ "

"నీకు డబ్బు తెచ్చిన వ్యక్తి ఎవరో గుర్తు పట్టగలవా? "

"గుర్తుపట్టగలను సార్. కానీ వాడు ఆ రోజు నుండే కనబడటం లేదు సార్ "

"ఈ హత్యలు ఎవరు చేయించారో, ఎందుకు చేయించారో చెప్పగలవా? " అంటూ తిరిగి కళ్ళజోడును ధరించి పెన్నును చేతిలోనికి తీసుకొన్నాడు.

"కనబడకుండ పోయిన అందర్నీ రప్పించండి తెలుస్తుంది " మరో గొంతు.

"మీరు కొంచెం ఓపిక పట్టండి " అంటూ వాళ్ళవైపు చేయి చూపించాడు.

"యింకెవరైనా ఏమైనా చెప్పగలరా? "

"నేను సెపుతాను " అంటూ మర్రి మొదట ఓ కంఠం. ఆ తరువాత ఆయన కుక్క కూడా ఒక్కసారే ఖల్‌మని తన యజమాని వైపు తలెత్తి చూసింది.

"భైరవ్ " అంటూ ఓసారి కుక్క తలను నిమిరాడు. అది కుయ్ కుయ్ మంటూ తోకాడిస్తూ తన మూతిని తానే నొక్కుకుంది.

"నీ పేరు? "

భద్రం అతను చెప్పలేదు, పక్కన ఉన్నవాళ్ళు చెప్పారు.

" నాదినైజాం అయ్యా, కూలి కోసం ఇర్వై ఏండ్ల కింద వచ్చినయ్య. కండ్లు పోయినయి. చేను కావలి చెట్టు కావలి వుండి పొట్ట నడుపుకుంటున్నయ్య. "

" నీవు గుడ్డికదా కాపలా.... "

" చెవులున్నాయి కదయ్యా "

" ఓహో అలాగా " అనుకుంటూ తలను కిందికి మీదికి ఆడించి

"ఆ చెప్పు భద్రం "

అందరూ భద్రం వైపు చూస్తున్నారు.

" గుడ్డివాడు ఏంచూసినాడని చెపుతాడు ? " అన్నారొకరు.

"ఈ సాక్ష్యం నిలవదు " మరొకడు.

"అయ్యలారా. నే సెప్పేది ఏంలేదు. నేను ప్రతిరోజు ఈ మర్రి చెట్టు కిందే

పడుకుంటాను. ఓ రోజు కోడి కూసే కంటే ముందే నా కుక్క ఎడతెరిపి లేకుండా మొరుగుతూ ఉంది. నేను అదిలించాను. యింతలో రాయితో ఎవరో కుక్కను కొట్టింద్రు. అది అరుస్తూ నా మంచం కిందకు చేరింది. ఎవరు? అన్నా సప్పుడు లేదు. గుడ్డి నాకొడుకు ఇక్కడున్నాడా? అని ఓ తిట్టు తిట్టి వాడేం చేస్తాడు ఎవర్కి చెపుతాడని? ఒకరు, కానివ్వండి అని మరొకడు. అంతే యిద్దరో ముగ్గురో మర్రి మీద ఎక్కి అక్కడ ఏదో పైన పెట్టొచ్చింద్రు" అన్నాడు భద్రం.

యిద్దరు కానిస్టేబుల్స్‌ని పిలిచి,

"పైకెక్కి ఏముందో చూడండి" - అన్నాడు కమీషనర్.

ఆదేశాలను అనుసరించారు కానిస్టేబుల్స్, కుక్క కుయ్ కుయ్ మంటూ మర్రి దగ్గర్కి భద్రం నిలుచున్న చోటే తిరుగుతూ ఉంది.

"సార్ ఈ కొమ్మల మీద మూతి కట్టి ఉన్న గోనె సంచి వుంది సార్"

"కిందికి తీసుకురండి" అన్నాడు కమీషనర్.

కుక్క కయ్ కుయ్ మంటూ తోకాడిస్తూ ఉంది.

చెట్టు మీది నుండి గోనెసంచిని కిందికి పడేశారు. కింద పడగానే అది పగిలి అన్ని గండుచీమలు పట్టి వున్న నిల్వకత్తులు, గండ్రగొడ్డళ్ళు, పిడిబాకులు, కర్రలను వేరు చేసిన బరిసెలు కనిపించాయి. వాటికంటిన రక్తం ఎండిపోయి వుంది. కమీషనర్. వాటి దగ్గరకెళ్ళి ఒక్కొక్కటే పరిశీలించాడు. ఒక తల్వార్ మీద రాం భూపాల్ చౌదరి అని, మరో బాకు మీద పెద్దిరెడ్డి రామిరెడ్డి అని - అలాగే ఒక్కొక్క ఆయుధం మీద ఒక్కొక్క యింటి పేరుతో సహా వాళ్ళ పూరి పేర్లు, కొన్నిటి మీద వాళ్ళ పూర్వీకుల పేర్లు వున్నాయి. కమీషనర్ చూస్తూ కనుబొమలు ముడి వేస్తూ నిలుచున్నాడు.

ఆ కత్తులను చూసేసరికి దళితుల కళ్ళలో నెత్తురు చిమ్మింది. తమవాళ్ళని చంపిన వాళ్ళు కళ్ళలో కదలగానే పిడికిళ్ళు బిగుసుకుపోయి రెప్పపాటులో అక్కడున్న ఆయుధాలను అందుకున్నారు.

కేకలు. అరుపులు

కమీషనర్ నివ్వెరపోయి నిల్చున్నాడు. మిగిలిన వాళ్ళు బిత్తరపోయి చూస్తున్నారు.

పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు.

క్షణాల్లో దళితులందరూ అక్కడినుండి పరుగెత్తారు.

కమీషనర్ చుట్టూరా పోలీసులు నిల్చున్నారు.

దళితవాడల్లో కొమ్ము ఊదుతున్న శబ్దం, ఊరు పొలిమేరను దాటుతూ ఉంది.

- నవంబర్ 97 ●